సర్పంచ్ నుంచి శాసనసభ వరకు.. 2





ఊరికి వెళ్లొచ్చేలోగా ఇల్లుగుల్ల.. 2

AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

## రెండురోజుల పాటు రైల్వేగేట్ మూసివేత

**అక్షరటుడే, ఇందూరు:** రైల్వే డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో నవీపేట్ రైల్వేగేట్‌ను రెండురోజుల పాటు మూసివేయనున్నారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజినీర్ బి.శ్రీనివాస్ ప్రకటన విడుదల చేశారు. ఈనెల 3వ తేదీ బుధవారం ఉదయం 6 గంటల నుంచి 4వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు గేట్‌ను మూసివేయనున్నారు. రైల్వేగేట్ మూసివేత నేపథ్యంలో నిజామాబాద్ నుంచి బాసర, భైంసా, ధర్మాబాద్ వైపు వెళ్లే వాహనదారులు జన్నేపల్లి మీదుగా వెళ్లాలని అధికారులు సూచించారు. అలాగే బాసర నుంచి జానకంపేట, బోధన్ వైపు వెళ్లే వాహనదారులు ఫకీరాబాద్-సాటాపూర్-సాటాపూర్ గేట్ మీదుగా వెళ్లాలన్నారు. బాసర నుంచి నిజామాబాద్ వెళ్లే వాహనదారులు జన్నేపల్లి మీదుగా వెళ్లాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. రైల్వే పనులకు వాహనదారులు సహకరించాలని కోరారు.



## నవీపేట కేజీబీవీలో ఏసీబీ తనిఖీలు..

**అక్షరటుడే, నవీపేట్ :** నవీపేట మండల కేంద్రంలోని కేజీబీవీలో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. ఇటీవల పీఎంశ్రీ నిధుల దుర్వినియోగంపై ఆరోపణలు రావడంతో విద్యాశాఖాధికారులు విచారణ చేసిన విషయం తెలిసిందే. దీనిపై సమగ్రంగా విచారించేందుకు ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. ఈ మేరకు మంగళవారం అధికారులు నేరుగా నవీపేట కేజీబీవీకి వెళ్లారు. గతంలో పీఎంశ్రీ కింద రూ.లక్షల్లో నిధులు విడుదల కాగా.. కొంతమేర నిధులు దుర్వినియోగం కావడంపై విచారణ జరిపారు. పీఎంశ్రీ నిధులు నవీపేట్, వర్ని కేజీబీవీలకు మంజూరయ్యాయి. అయితే నవీపేట్ పీఎంశ్రీ నిధులపై ఏసీబీ అధికారులు ఆరా తీశారు. విచారణ నివేదికను హైదరాబాద్‌లోని ఏసీబీ కార్యాలయంలో సమర్పించనున్నట్లు సమాచారం.

## ఆర్మూర్ ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్‌గా రవిబాబు



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ మున్సిపల్ ఇన్‌ఛార్జిగా రవిబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయనను ఆర్మూర్ ఇన్‌ఛార్జి కమిషనర్‌గా నియమించారు. దీంతో ఆయన మంగళవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు ఇటీవల ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. రవి బాబు బాధ్యతలు స్వీకరించగా.. మున్సిపల్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.




## ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

**అక్షరటుడే, ఇందూరు :** పంచాయతీ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని తెలిపారు. హైదరాబాద్ నుంచి జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల పరిశీలకులు, పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తొలి, రెండోవిడత నామినేషన్ల స్వీకరణ పూర్తయిన నేపథ్యంలో ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సిబ్బంది కేటాయింపు, పోస్టల్ బ్యాలెట్, బాక్సులు, శాంతిభద్రతను తదితర అంశాలపై సమీక్షించారు. జిల్లాలో తొలి, రెండో విడత నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ విజయవంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా, మండల స్థాయిలో అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. సమావేశంలో సాధారణ పరిశీలకులు శ్యాంప్రసాద్ లాల్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, అదనపు డీసీపీ బస్వారెడ్డి పాల్గొన్నారు.

**ఉమ్మడి జిల్లాలో పంచాయతీ ఎన్నికల హడావుడి నెలకొంది. ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యంగా నగదు, లిక్కర్ సరఫరాపై ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. ఎక్కడికక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. దాంతో అధిక మొత్తంలో నగదు తీసుకెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు.**

**- అక్షరటుడే, కామారెడ్డి/నిజామాబాద్ సిటీ**



# తనిఖీలు ముమ్మరం

- పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీసుల చర్యలు
- నగదు తరలింపుపై కఠిన ఆంక్షలు
- రూ.50 వేలకు పైగా దొరికితే సీజ్
- ఎక్కడికక్కడ చెక్‌పోస్టుల ఏర్పాటు

ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో పోలీసులు, అధికారులు నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నారు. నగదు తరలింపుపై క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతున్నారు. ప్రజలు తమకు అవసరమైన మేరకు మాత్రమే నగదు తీసుకెళ్లాలని అధికారులు సూచిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో తీసుకెళ్లే నగదుకు లెక్కలు చూపించాలని కచ్చితంగా చెబుతున్నారు. గ్రామాల నుంచి పట్టణాలకు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు తమ వెంట రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లొద్దని సూచిస్తున్నారు. అంతకంటే ఎక్కువ నగదు ఉంటే సీజ్ చేస్తామని హెచ్చరిస్తున్నారు. ఎక్కువ మొత్తంలో నగదు ఉంటే సంబంధిత నగదుకు డాక్యుమెంట్లు తప్పకుండా చూపించాలని పేర్కొంటున్నారు.

### ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల ఏర్పాటు

ఎన్నికల నేపథ్యంలో అధికారులు తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. కామారెడ్డి జిల్లాలో 25 ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, ఐదు స్టాటిక్ సర్వ్ లైన్స్ టీమ్స్, రెండు అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు, మూడు అంతర్ జిల్లా చెక్ పోస్టుల ఏర్పాటు చేశారు.




నిజామాబాద్ జిల్లాలో మొత్తం 31 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేపడుతూ ప్రలోభాలకు గురి చేసే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నారు. ప్రధానంగా డబ్బు, మద్యం పై దృష్టి సారించారు. బోధన్ మండలంలోని సాలూరా, ఖండ్‌గాంలో రెండు అంతరాష్ట్ర చెక్ పోస్టులు, ఆరు అంతర్ జిల్లా చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతరంగా తనిఖీలు చేపడుతున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 17 కేసులు నమోదు చేసినట్లు డీపీవో శ్రీనివాసరావు తెలిపారు. రూ.1.38లక్షల విలువ చేసే 146 లీటర్ల మద్యం సీజ్ చేశారు.

### జాగ్రత్తలు పాటించాలి



జిల్లాలో ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేస్తున్నాం. ఇప్పటికే ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు, చెక్ పోస్టులను ఏర్పాటు చేశాం. ఎన్నికలు ముగిసే వరకు ఈ బృందాలు రాత్రింబవళ్లు తనిఖీలు చేపడతాయి. ప్రజలు నగదు ఇతర ప్రాంతాలకు, ఇంటికి తీసుకెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలి. డబ్బులకు సంబంధించిన లెక్కలు, పత్రాలు చూపించాల్సి ఉంటుంది.

**– రాజేష్ చంద్ర, కామారెడ్డి ఎస్పీ**

### కఠిన నిబంధనలు అమలు



పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తోంది. పోటీ చేసే అభ్యర్థులు గాని ఇతర వ్యక్తులు గాని ప్రలోభాలకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది. నవీపేట్ మండలం యంచ వద్ద, ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. ప్రతివాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నాం. ప్రతి మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పర్యవేక్షణ కొనసాగుతోంది.

**– రాజా వెంకట్‌రెడ్డి, ఏపీసీ, నిజామాబాద్**

## డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం

**అక్షరటుడే, ఇందూరు :** డంపింగ్ యార్డు సమస్యను శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకుంటున్నామని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా పేర్కొన్నారు. నాగారంలోని డంపింగ్ యార్డును మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బయో మైనింగ్ ద్వారా చెత్తను శుభ్రపర్చే పనులు వేగంగా కొనసాగుతున్నాయని వెల్లడించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం డంపింగ్ యార్డులో చెత్త సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నానన్నారు. డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త వల్ల పరిసరాలకు సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. బయో మైనింగ్ పద్ధతిలో భాగంగా పాత చెత్తను వేరుచేసి, శుభ్రపర్చి తిరిగి ఉపయోగించుకునేలా చేయడం జరుగుతుందన్నారు. మొత్తం 3,51,500 మెట్రిక్ టన్నుల చెత్తను శుద్ధిచేసే ప్రక్రియ త్వరలోనే పూర్తవుతుందని తెలిపారు. ప్రస్తుతం రెండు మిషన్లు పనిచేస్తుండగా.. అదనంగా మరో రెండుమిషన్లు అవసరమవుతాయని త్వరలోనే అందుబాటులోకి వస్తాయన్నారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులు ఇల్లెందుల ప్రభాకర్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.



## ఆటోవాలాల సమస్యలు పరిష్కరించాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ల జేఏసీ ప్రతినిధులు శుక్రవారం ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సాయం, ఆటోనగర్‌లో అభివృద్ధి వంటి హామీలు ఇంకా నెరవేర్చలేదని తెలిపారు. కార్యక్రమంలో ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉమర్ ఖాన్, భూషణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## నకిలీ నోట్ల ముఠా సభ్యులపై పీడీ యాక్ట్

**అక్షరటుడే, కామారెడ్డి:** అంతర్రాష్ట్ర నకిలీ నోట్ల ముఠాపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే ముగ్గురిపై నమోదు చేసిన పోలీసులు తాజాగా మంగళవారం ముఠాలోని మరొక ఇద్దరు సభ్యులపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని వైన్స్ షాప్‌లలో రెండు నకిలీ రూ.500 నోట్లు వినియోగించిన కేసులో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు తెలంగాణతో పాటు పశ్చిమబెంగాల్, బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి మొత్తం 11 మంది నిందితులను అరెస్ట్ చేశారు. ఇప్పటికే మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రధాన నిందితుడు లఖన్ కుమార్ దుబే, యూపీకి చెందిన సత్యదేవ్ యాదవ్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన సౌరవ్‌డేలపై పోలీసులు పీడీ యాక్ట్ అమలు చేశారు. యూపీకి చెందిన దివాకర్ చౌదరి అలియాస్ బ్రిజేష్ కుమార్ గుప్తా, పశ్చిమ బెంగాల్‌కు చెందిన హరి నారాయణ భగత్ అలియాస్ సంజయ్‌లపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. నిందితులు నిజామాబాద్ సెంట్రల్ జైళ్లలో నిర్బంధంలో ఉండగా ఉత్తర్వులను కామారెడ్డి టౌన్ సీఐ నరహరి, హెడ్ కానిస్టేబుల్ వీఎల్ నర్సింలు జైలులో ఉన్న నిందితులకు అందజేశారు.



## నడ్డాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎంపీ అర్వింద్

**భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు కేంద్రమంత్రి నడ్డాను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని నడ్డా కార్యాలయంలో ఆయనను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సహచర ఎంపీలు డీకే అరుణ, రఘునందన్ రావు, గోడం నగేష్ తదితరులు పాల్గొన్నారు.** – అక్షరటుడే, ఇందూరు

## ప్రజల భద్రతలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదు: ఎస్పీ

**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రజల భద్రత విషయంలో నిర్లక్ష్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించేది లేదని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. మాచారెడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలోని చెక్‌పోస్ట్‌ను మంగళవారం పరిశీలించారు. చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీలకు సంబంధించిన రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. విధుల్లో ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో డబ్బు, మద్యం, నిషేధిత వస్తువుల రవాణా అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. దీనికోసం చెక్‌పోస్టు వద్ద బ్యారికేడ్లను వినియోగిస్తూ ప్రతి వాహనాన్ని క్షుణంగా తనిఖీ చేయాలని ఎస్పీ ఆదేశించారు. డ్యూటీ రోస్టర్ ప్రకారం సిబ్బంది క్రమబద్ధంగా విధులు నిర్వహించాలని, వాహనాలు, అనుమానాస్పద వ్యక్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ ఉండదని ఆయన స్పష్టం చేశారు. విధుల్లో ఎవరూ నిర్లక్ష్యం వహించరాదని, ప్రజలకు శాంతి భద్రతలు అందిచడమే పోలీస్ శాఖ లక్ష్యమన్నారు. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు పోలీసులు పూర్తి బాధ్యతతో పనిచేస్తున్నారన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ పకడ్బందీగా అమలు చేస్తున్నామని, ఇప్పటికే ఫ్లయింగ్ స్క్వాడ్, చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసేవరకు బృందాలు నిరంతరం తనిఖీలు కొనసాగిస్తాయని తెలిపారు. ఎస్పీ వెంట మాచారెడ్డి ఎస్సై అనిల్, సిబ్బంది ఉన్నారు.





## సర్పంచ్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పిట్లం మండల కేంద్రంలో మంగళవారం నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. ఈ క్రమంలో సర్పంచ్ అభ్యర్థి కుమ్మరి శేఖర్ నామినేషన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలే సర్పంచ్‌లను గెలిపిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో కార్యకర్తలు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## నామినేషన్ల దాఖలులో ఇబ్బందులు లేకుండా చూడాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నామినేషన్ల దాఖలులో అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆర్డీవో పార్థసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎల్లారెడ్డి ఎంపీడీవో, భిక్కనూరు పంచాయతీ కార్యాలయాలను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. అధికారులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్డీవో మాట్లాడుతూ ఈనెల 30 నుంచి ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ మంగళవారంతో ముగియనుందన్నారు. నామినేషన్ల ప్రక్రియలో భాగంగా అభ్యర్థులకు టోకెన్లు జారీచేసి క్రమపద్ధతిలో స్వీకరించాలని ఆర్డీవో సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కార్యాలయంలో తగిన వసతులు ఏర్పాటు చేయాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సర్పంచ్, వార్డు స్థానాల కోసం నిర్వహిస్తున్న ఎన్నికల్లో ఎలాంటి తప్పిదాలు, పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని సూచించారు.



## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

**అక్షరటుడే, బాన్సువాడ :** బాన్సువాడ మండలంలోని తాడ్కోల్ గ్రామానికి చెందిన సుమారు 30 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మంగళవారం బీఆర్ఎస్‌లో చేరారు. బాన్సువాడ నియోజకవర్గ సీనియర్ నాయకుడు, బాన్సువాడ మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ షేక్ జుబేర్ ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా జుబేర్ మాట్లాడుతూ.. తాడ్కోల్ గ్రామ ప్రజలు అభివృద్ధి, శాంతి కోసం బీఆర్ఎస్ పార్టీపై నమ్మకం ఉంచి పార్టీలో చేరడం జరిగిందన్నారు. గ్రామంలోని అభివృద్ధి కార్యక్రమాలకు తాము నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్లోకి చేరిన వారిలో నూర్ మియా, అంజయ్య, సిద్దప్ప, షకీల్ సదర్, వాహిద్ భాయ్, గౌస్ టైలర్, బషీర్ ఖాన్, షేక్ ఖమర్, షేక్ జుబేర్ దుబ్బా, షేక్ సుమర్, ఆవేజ్, అమీర్, ఆసిఫ్, ఫైసల్, కలీం, షోయబ్ తదితరులు ఉన్నారు.


## మీడియా సెంటర్, ఎంసీఎంసీ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



**అక్షరటుడే, ఇందూరు:** గ్రామ పంచాయతీ ఎన్నికలను పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెల్ ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం సందర్శించారు. ఎన్నికల సందర్భంగా ఎంసీఎంసీ ద్వారా చేపడుతున్న పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం కంట్రోల్ రూంను సందర్శించి ఎన్నికలతో ముడిపడిన అంశాలకు సంబంధించి ఫోన్ ద్వారా వచ్చిన ఫిర్యాదులు, సూచనలను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎంసీఎంసీ కమిటీ మెంబర్ సెక్రెటరీ ఎన్.పద్మశ్రీ తదితరులున్నారు.

ఏ రంగంలో రాణించాలన్నా గట్టిపునాది అవసరం.. అయితే రాజకీయాల్లో రాణించాలంటే అదృష్టంతో పాటు కృషి, పట్టుదల ఉండాల్సిందే.. కామారెడ్డి జిల్లాకు చెందిన పలువురు సర్పంచ్‌లుగా తమ రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టి ఎమ్మెల్యేలు, ఎంపీలుగా ఎదిగారు. కొందరు మంత్రులుగా సైతం పనిచేయడం విశేషం. జిల్లానుంచి రాష్ట్రస్థాయి జాతీయస్థాయి పదవులను అలంకరించిన నాయకులపై 'అక్షరటుడే' ప్రత్యేక కథనం.

– అక్షరటుడే, ఎల్లారెడ్డి




# సర్పంచ్ నుంచి శాసనసభ వరకు..

▸ ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన సర్పంచ్‌లు ▸ మచ్చలేని నాయకులుగా పేరు.. ▸ ప్రజాక్షేత్రంలో ప్రత్యేక గుర్తింపు



లింగంపేట్ మండలం ఐలాపూర్ గ్రామంలో తాడూరి బాలా గౌడ్ జన్మించారు. ఆయన తన రాజకీయ ప్రస్థానాన్ని 1960లో బోనాల గ్రామపంచాయతీ వార్డు సభ్యుడిగా ప్రారంభించారు. 1972లో బోనాల సర్పంచ్‌గా గెలిచారు. అనంతరం ఎల్లారెడ్డి పంచాయతీ సమితి అధ్యక్షుడిగా పనిచేశారు. 1978లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. అనంతరం ఆయన టి.అంజయ్య, భవనం వెంకట్రామ్ రెడ్డి మంత్రివర్గాల్లో చక్కెర పరిశ్రమ, రోడ్లు భవనాల శాఖల మంత్రిగా పనిచేశారు. 1983లో ఎన్టీఆర్‌పై ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పటికీ... 1984, 1989లో రెండు పర్యాయాలు నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడిగా గెలుపొందారు. అనంతరం నిజామాబాద్ జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా సేవలందించారు.

### యేర్వ శ్రీనివాస్ రెడ్డి



ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని నాగిరెడ్డిపేట మండలం తాండూర్ గ్రామానికి చెందిన యేర్వ శ్రీనివాస్ రెడ్డి గ్రామ సర్పంచ్‌గా తన రాజకీయల ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1981లో తాండూర్ గ్రామ సర్పంచ్‌గా గెలిచిన ఆయన.. 1985లో తెలుగు దేశం పార్టీ నుంచి ఎమ్మెల్యే టికెట్ రావడంతో సర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. అనంతరం 1985 నుంచి 1989 వరకు ఎమ్మెల్యేగా కొనసాగారు. నియోజకవర్గ ప్రజలకు ఉత్తమ సేవలందించారు.

### లింగన్నగారి కిషన్ రెడ్డి



లింగంపేట్ మండలం శెట్టిపల్లి సంగారెడ్డి సర్పంచ్‌గా లింగన్నగారి కిషన్ రెడ్డి (లంకలపల్లి) తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన 1981 సంవత్సరంలో శెట్టిపల్లి సంగారెడ్డి సర్పంచ్‌గా గెలిచారు. 1983లో తెలుగుదేశం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా అవకాశం రావడంతో సర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందారు. అయితే ఆ సమయంలో రాష్ట్రంలో జరిగిన రాజకీయ సంక్షోభం వలన కారణంగా పదవికి రాజీనామా చేశారు.

### నేరెళ్ల ఆంజనేయులు



గాంధారి మండల కేంద్రానికి చెందిన నేరెళ్ల ఆంజనేయులు 1989లో గాంధారి సర్పంచ్‌గా గెలిచారు. అదే ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా టికెట్ లభించడంతో సర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. 1989, 1994, 1999లో మూడు పర్యాయాలు గెలుపొంది హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా నిలిచారు. ప్రభుత్వ విప్‌గా, సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా, రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ మంత్రిగా ఆయన 2002లో బాధ్యతలు నిర్వహించారు.

### బొగడమీది జనార్దన్ గౌడ్



ఎల్లారెడ్డి నియోజకవర్గం నాయుడుపేట మండలంలోని ధర్మారెడ్డి గ్రామంలో జనార్దన్ గౌడ్ జన్మించారు. 1987లో ధర్మారెడ్డి గ్రామ సర్పంచ్‌గా గెలుపొందారు. 1999లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయిన ఆయన 2008లో శాసనసభ్యుడిగా గెలిచారు.



## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్లను ట్రేస్ అవుట్ చేశామన్నారు. బాధితులు ఆంజనేయులు, మహేశ్, లింగమణిలకు ఫోన్లను అప్పగించామని పేర్కొన్నారు.


## నామినేషన్ల స్వీకరణలో జాగ్రత్తలు అవసరం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, తప్పిదాలకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎల్పీవో సురేందర్ సూచించారు. మత్తమాల గ్రామ పంచాయతీలో నామినేషన్ కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. రెండో విడత నామినేషన్ల ప్రక్రియ చివరి రోజున ఎక్కువ మంది నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉన్నందున, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. చివరి సమయంలో ఏదైనా పొరపాటు జరిగితే నామినేషన్ తిరస్కరణకు గురయ్యే అవకాశాలున్నాయని చెప్పారు. కాబట్టి అభ్యర్థులు ముందుజాగ్రత్త వహించాలన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అభ్యర్థులకు ఏమైనా సందేహాలుంటే హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు.



## విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు

**అక్షరటుడే, ఆర్మూర్:** నగరంలోని సీనునాయక్ డెంటల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆలూర్ మండలంలోని గుత్ప జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ఉచిత దంత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ మేరకు ఆస్పత్రి వైద్యులు విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు చేశారు. పలువురు గ్రామస్థులకు సైతం పరీక్షలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు, గ్రామస్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. దంత సమస్యలు ఉంటే వెంటనే దంత వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పేస్టులు, డెంటల్ కిట్స్ అందజేశారు. కార్యక్రమంలో సీను నాయక్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




## ఊరికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్ల..

**అక్షరటుడే, కామారెడ్డి :** బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేసరికి ఇల్లు గుల్లయ్యింది. ఇంట్లో భారీగా సొత్తు చోరీకి గురైంది. ఈ ఘటన కామారెడ్డి పట్టణంలోని సైలాన్ బాబా కాలనీలో మంగళవారం వెలుగుచూసింది. బాధితుడు, పోలీసుల కథనం ప్రకారం.. కాలనీలో నివసించే మహమ్మద్ వహీద్ తన బంధువుల ఇంటికి సిద్దిపేటకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి ఇంట్లో దొంగలు పడ్డట్టు గుర్తించాడు. దొంగలు తాళాలను పగులగొట్టి 7 తులాల బంగారం, 80 తులాల వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. దీంతో ఆందోళనకు గురైన బాధితుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, క్లూస్ టీం సిబ్బంది వేలిముద్రలను సేకరించారు. బాధితుడు వహీద్ మాట్లాడుతూ.. తమ బంధువుల ఊరైన సిద్దిపేటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి దొంగలు తమ ఇంటి తాళాలను పగులగొట్టారన్నారు. ఇంట్లో ఉన్న గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను ఓపెన్ చేసి వెళ్లారని బాధితుడు వాపోయాడు. బీరువాలో దాచిన బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి క్లూస్‌టీం సిబ్బందితో వేలిముద్రలను సేకరించి కాలనీలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టినట్లు కామారెడ్డి పట్టణ సీఐ నరహరి తెలిపారు.



## బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన

**అక్షరటుడే,బాల్కొండ:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థినులకు బాల్యవివాహాల నిర్మూలనపై మంగళవారం అవగాహన కల్పించారు. మహిళా, శిశు సంక్షేమ, వయోవృద్ధుల శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బాల్య వివాహ విముక్త్ భారత్‌లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. జెండర్ స్పెషలిస్టులు సౌమ్య, కవిత ఆధ్వర్యంలో విద్యార్థినులకు లింగ సమానత్వం, లింగ వివక్ష, బాల్యవివాహాలతో నష్టాలపై వివరించారు. సుకన్య సమృద్ధి యోజన, మిషన్ వాత్సల్య వంటి పథకాలపై విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించారు. అలాగే పోక్సో చట్టం, 1098 చైల్డ్ హెల్ప్‌లైన్, 181 మహిళా హెల్ప్‌లైన్ గురించి అవగాహన కల్పించారు. సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ భాను మాట్లాడుతూ ఆన్‌లైన్ వేధింపులు, మహిళా భద్రత, సఖి కేంద్రం సేవల వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




## నారుమడి యాజమాన్యంపై రైతులకు అవగాహన



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని వెల్లుట్ల, హిమగిరి శివారులోని వరి నారుమడులను జిల్లా వ్యవసాయాధికారి మోహన్ రెడ్డి పరిశీలించారు. ఈ మేరకు నారుమడి యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. నారు నాటడానికి వారం రోజుల ముందుగా ఎకరం పొలంలో కార్బోఫురాన్ 3జీ గుళికలు ఒక కిలో వేసుకోవాలని తెలిపారు. దీంతో పంటకు ఆశించే కాండం తొలిచే, ఆకు మడత పురుగును అరికట్టవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయనతో పాటు మండల వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, ఏఈవో రాజాగౌడ్, రైతు లక్ష్మయ్య పాల్గొన్నారు.

## టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండల ఇంగ్లిష్ ఉపాధ్యాయుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఇంగ్లిష్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఎమ్మార్సీ భవన్‌లో భారతీ ఎయిర్‌టెల్, టీఎస్ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో ఇంగ్లిష్ భాషపై విద్యార్థులకు పరీక్ష నిర్వహించారు. దీంట్లో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు గెలుచుకున్నారు. పోటీలో జూనియర్ విభాగంలో జడ్పీహెచ్ఎస్ బషీరాబాద్ విద్యార్థి చిన్నబాబు మొదటిస్థానంలో నిలవగా.. చౌట్‌పల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థి రూపేష్ ద్వితీయ స్థానంలో నిలిచాడు. సీనియర్స్ విభాగంలో బషీరాబాద్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి అమూల్య మొదటి స్థానంలో నిలవగా మధుప్రియ రెండో స్థానంలో నిలిచారు. వ్యాసరచన పోటీలో కోనసముందర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి శివాగౌడ్ విద్యార్థి ప్రథమస్థానంలో, చౌట్‌పల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థి ప్రసన్న రెండోస్థానంలో నిలిచారు. సీనియర్స్ విభాగంలో కమ్మర్‌పల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థి కార్తికేయ మొదటిస్థానంలో, కోనసముందర్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి సందీప్ రెండోస్థానంలో నిలిచారు. విజేతలకు ఎంఈవో ఆంధ్రయ్య బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్ర, మహికాంత్, మధుబాబు, గున్నాల రవి పాల్గొన్నారు.

## మూడో విడత సర్పంచ్ ఎన్నికల షెడ్యూల్ విడుదల



**అక్షరటుడే, మెండోరా:** మూడో విడత సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ బుధవారం నుంచి ప్రారంభమవుతుందని ఎంపీడీవో కొండా లక్ష్మణ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. డిసెంబర్ 3 నుంచి ఐదో తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందన్నారు. అలాగే 6వ తేదీ నుంచి 7వ తేదీ వరకు తిరస్కరించబడిన నామినేషన్లపై ఆర్మూర్ సబ్ కలెక్టర్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. 9వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు విత్‌డ్రా చేసుకునే అవకాశం ఉందని వివరించారు. విత్‌డ్రా అనంతరం ఫైనల్ అభ్యర్థుల జాబితా విడుదల చేస్తామని తెలిపారు. డిసెంబర్ 17న స్థానిక సంస్థలకు సంబంధించి పోలింగ్ ఉంటుందని ఎంపీడీవో వివరించారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటింగ్.. మధ్యాహ్నం 2 గంటల నుంచి ఆర్‌వో పర్యవేక్షణలో కౌంటింగ్ ఉంటుందని స్పష్టం చేశారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత గెలిచిన వార్డు సభ్యుల ఓట్లతో ఉపసర్పంచ్‌ను ఎన్నుకుంటారని పేర్కొన్నారు.